ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 19 ఫిబ్రవరి 2024



ఆదుకోని అపరాలు




నరసన్నపేట మండలం పొన్నానపేట వద్ద కల్లాల్లో ఉన్న మినప పంట

- తేనె మంచుతో మాడిన పెసర, మినుము పూత
- తగ్గిన దిగుబడులు.. కొనుగోలు కేంద్రాలు ఎక్కడ?
- రైతులను దోచుకుంటున్న వ్యాపారులు

● గత నెల 27న సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన ఒక మహిళ తనకు పండిన మినుములను విక్రయించేందుకు నరసన్నపేటలోని ఒక ట్రేడర్‌కు వచ్చింది. మినుముల్లో చెత్త ఉందని, 5 కేజీల తరుగు ఇవ్వాలని లేదంటే కొనుగోలు చేయమని వ్యాపారి చెప్పాడు. దీంతో మరో ట్రేడర్‌కు వెళ్లింది. అక్కడ కూడా ఇదే పరిస్థితి. దీంతో గత్యంతరం లేక వ్యాపారులు అడిగిన సొమ్ముకే ఆ మహిళ తన పంటను విక్రయించింది.

● జలుమూరు మండలం కూర్మనాథపురానికి చెందిన ఒక రైతు నాలుగు క్వింటాల పెసలు పట్టుకొని నరసన్నపేటలోని ఒక వ్యాపారి వద్దకు వచ్చాడు. అయితే, క్వింటాను రూ.7,800కు కొనుగోలు చేయాల్సిన ఆ వ్యాపారి.. పెసలు చిన్నవిగా ఉన్నాయని.. మట్టి, రాళ్ల ఉన్నాయని చెప్పి క్వింటాకు రూ.500 తగ్గించి కొనుగోలు చేశాడు. ఇలా గ్రామస్థాయిలో కొనుగోలు కేంద్రాలు లేక... వ్యాపారులు చెప్పిన ధరలకు రైతులు విక్రయించుకోవాల్సిన పరిస్థితి జిల్లా అంతటా దాపరించింది.



(నరసన్నపేట)

ఖరీఫ్‌లో పండించిన ధాన్యం అమ్ముకునేందుకు రైతులు మొన్నటి వరకూ కష్టాలు పడ్డారు. ఇప్పుడు రబీలో సాగు చేసిన అపరాలను విక్రయించేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఈ ఏడాది పొగమంచు కారణంగా పూత మాడిపోయి అపరాల దిగుబడులు గణనీయంగా తగ్గాయి. దానికి తోడు ధరలు కూడా తగ్గిపోవడంతో అపరాల రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. జిల్లాలో నరసన్నపేట, జలుమూరు, సారవకోట, ఆమదాలవలస, సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట, హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి తదితర మండలాల్లో అపరాలు సాగు చేస్తున్నారు. ఒక్క నరసన్నపేట నియోజవర్గంలోనే 20వేల ఎకరాల్లో పెసర, మినుము పంటలు వేశారు. సంక్రాంతి వరకూ ఆశాజనకంగా ఉన్న ఈ పంటలు ఇటీవల కురిసిన మంచు, మబ్బులు కారణంగా పూత మాడిపోయి, కాయలకు తెగుళ్లు సోకాయి. దీంతో రైతులు మందులు పిచికారీ చేశారు. అయినప్పటికీ అనుకున్నంత స్థాయిలో దిగుబడులు రాలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత ఏడాది ఎకరాకు 3-4బస్తాల మధ్య దిగుబడులు రాగా ఈ ఏడాది బస్తా కూడా రావడం లేదని ఆవేదన చెందుతున్నారు.



నరసన్నపేట గిడ్డంగుల్లో పోగు అయిన మినములు

నాణ్యత పేరుతో దోపిడీ..

ప్రభుత్వం అపరాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. నాణ్యత పేరుతో రైతులను వ్యాపారులు దోచుకుంటున్నారు. మినముల్లో రాళ్ల ఉన్నాయని, అలాగే కొండ మినప ఉందని సాకులు చెబుతూ క్వింటాకు ఐదు కేజీల తరుగు అడుగుతున్నారు. పైగా మద్దతు ధరపై రూ.500కు తక్కువగా కొనుగోలు చేస్తున్నారు. నరసన్నపేట కేంద్రంగా 20 మంది వ్యాపారులు నాలుగు ట్రేడర్స్ ద్వారా ఈ దందా సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో వ్యాపారులు పాడిందే పాట.. ఆడిందే ఆటగా తయారైయింది.

కౌలు రైతుకు కష్టమే..

కౌలు రైతులను అపరాలు దెబ్బతీశాయి. ఈ ఏడాది ఎకరా పొలానికి రూ.19వేలు వరకూ కౌలు చెల్లించారు. వ్యవసాయ పెట్టుబడులు, ఇతర ఖర్చులకు ధాన్యం సొమ్ము సరిపోగా అపరాలైనా తమను ఆదుకుంటాయని కౌలు రైతులు భావించారు. కానీ, అంతగా దిగుబడులు రాకపోవడంతో వారు దిగాలు చెందుతున్నారు. గత ఏడాది క్వింటా పెసలు ధర రూ.9,500 ఉండగా, ప్రస్తుతం రూ.7,800 మాత్రమే ఉంది. మినుములు గతేడాది ఆగస్టులో క్వింటా రూ.9,400 ఉండగా ఈ ఏడాది రూ.7,900 ఉంది. దీంతో కౌలు రైతులకు వ్యవసాయం భారంగా మారింది.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం అపరాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేయాలి. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడుతున్నారు. వారు నచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

-శిమ్మ చంద్రశేఖర్, మాకివలస

రైతులను ఆదుకోవాలి



వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు. పెసలు, మినుముల్లో రాళ్ల, మట్టి ఉన్నాయని చెప్పి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. తూకాల్లో కూడా మోసాలకు పాల్పడుతున్నారు. మార్కుఫెడ్ ఆధ్వర్యంలోనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

-జల్లు చంద్రమౌళి, ఉర్లాం, ల్యాండ్‌లార్డ్

మార్గదర్శకాలు రాలేదు

అపరాల కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. వ్యాపారులపై ఫిర్యాదులు వస్తే ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటాం.

- రవీంద్ర భారతి, ఏడీ, వ్యవసాయశాఖ

ఎక్కడ ఉన్నా.. ఇక్కడే ఓట్లు

- కొంతమందికి రెండు చోట్ల నమోదు
- లోపాలమయంగా జాబితా



చిగురువలసలో రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు

(సరుబుజ్జిలి)

రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా లోపాలమయంగా కనిపిస్తోందని బూత్‌కన్వీనర్లు, ఏజెంట్లు ఆరోపిస్తున్నారు. సరుబుజ్జిలి మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్ల జాబితాల్లోని తప్పులతడకలు బయటపడుతున్నాయి. కొంతమంది ఉపాధి కోసం కొన్నేళ్ల కిందట శాశ్వతంగా వలసపోయినా ఇక్కడి ఓటర్లుగానే కొనసాగుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకొంతమందికి రెండేసి చోట్ల ఓట్లు నమోదు కావడం చర్చనీయాంశమవుతోంది.

● సరుబుజ్జిలి మండలం పెద్దపాలెంలోని 205 నెంబర్ పోలింగ్ కేంద్రంలో 878 ఓట్లు ఉన్నాయి. ఈ గ్రామంలో ఆరు వార్డులు ఉన్నాయి. కాగా, పక్కనున్న చిన్నపాలెం గ్రామానికి చెందిన 7, 8 వార్డులకు సంబంధించి సుమారు 42 ఓట్లు.. పెద్దపాలెంలో ఉన్నాయి. అలాగే పెద్దపాలేనికి చెందిన 25 ఓట్లు చిన్నపాలెంలోని 7, 8వార్డుల్లో నమోదు చేశారు. పురుషోత్తపురం, కొండవలస పంచాయతీ లకు చెందిన ఓటర్లను కూడా పెద్దపాలెం పంచాయతీలో నమోదు చేశారు. వాటిని తొలగించాలని దరఖాస్తు చేసినా ప్రయోజనం లేకపోయిందని గ్రామస్థులు చెబుతున్నారు.

● గోనుపాడు గ్రామంలోని 160వ పోలింగ్ కేంద్రంలో 851 ఓట్లు ఉన్నాయి. ఇక్కడి ఓటర్లు శాశ్వతంగా వలస వెళ్లిపోయారు. అయినప్పటికీ ఓటర్ల జాబితాలో వారి పేర్లను తొలగించలేదు. దీంతో చాలామంది రెండుచోట్ల ఓటర్లుగా కొనసాగుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. గోనుపాడుకు చెందిన మామిడి ఉమామహేశ్వరరావు, ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి 30ఏళ్ల కిందట హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఇప్పటికీ వారు ఇక్కడ ఓటర్లుగా కొనసాగడంపై జాబితాలో లోపాలు తేటతెల్లమవుతున్నాయి. ఒడిశా రాష్ట్రంలో నివాసం ఉంటున్న కవిటి జగన్నాథరావు, ధనలక్ష్మి పేర్లు కూడా ఇక్కడి జాబితాలో కొనసాగుతున్నాయి. వారు దరఖాస్తు చేసినా తొలగించలేదు.

● చిగురువలస 180వ పోలింగ్ కేంద్రంలో 1140 ఓట్లు ఉన్నాయి. నేతింటి రమణ, నేతింటి జయమ్మ, మొయ్యల ఎ ర్రమ్మ, మొయ్యల సీతారాం, గేదెల శివ పేర్లతో చిగురువలసతో పాటు ఇతర గ్రామాల్లో కూడా ఓట్లు ఉన్నాయని బూత్ కన్వీనర్ కొర్ను సూర్యనారాయణ తెలిపారు. అలాగే శాశ్వతంగా వలసలు వెళ్లిన తోటాడ రాజా, కొట్టు వెంకటరావు పేర్లు తొలగించలేదు. ఇప్పటికైనా గ్రామస్థాయి పోలింగ్ కేంద్ర అధికారులు ఓటర్లు జాబితాలపై సమగ్ర విచారణ చేసి సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

పూరీ టూ చెన్నై.. వయా పలాస!

- 16 కిలోల గంజాయితో పట్టుబడిన తమిళనాడు వాసులు




గంజాయితో పట్టుబడిన నిందితులు

పలాస, ఫిబ్రవరి 18: పలాస రైల్వేస్టేషన్‌లో 16 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రం పూరీ జిల్లా తలాడ నుంచి చెన్నైకి దీనిని ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఇటీవల గంజాయి, మాదకద్రవ్యాలు ఎక్కువగా రవాణా అవుతున్నాయి. ఈ నేపథ్యంలో రైల్వే పోలీసులు నెల రోజులుగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం రైల్వేస్టేషన్‌లో అనుమానిత ప్రయాణికుల లగేజీ బ్యాగులు తనిఖీ చేశారు. తమిళనాడు రాష్ట్రం పరమేటి గ్రామానికి చెందిన ఎస్.మనికందన్, నడువకరిచి గ్రామానికి చెందిన కల్లతియస్‌ల లగేజీ బ్యాగులను తనిఖీ చేయగా.. 16కిలోల గంజాయి(8 ప్యాకెట్లు) లభించింది. వారు పరారీ అయ్యేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని పట్టుకొని అరెస్టు చేసారు. వీరు పూరి జిల్లా తలాడ వద్ద ఓ బ్రోకరు నుంచి గంజాయి కొనుగోలు చేసుకొని చెన్నై తరలించేందుకు పలాస వద్ద రైలు దిగారు. ఆదివారం రాత్రి వీరు చెన్నై వెళ్లాల్సి ఉంది. మరో గంటలో గంజాయి రవాణాదారులు రైలు ఎక్కాల్సి ఉండగా పోలీసులు చాకచక్యంగా వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షరీఫ్ విలేకర్లకు తెలిపారు. గంజాయి రవాణాదారులను పట్టుకున్న సిబ్బందిని అభినందించారు. నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. 10రోజుల వ్యవధిలో మొత్తం మూడు ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న విషయం విదితమే.

జీడి పంటపై పొగమంచు దెబ్బ

- తగ్గనున్న దిగుబడి
- రైతుల్లో ఆందోళన





మాడిపోతున్న జీడిపూత

(పలాస)

జీడి రైతులను పొగమంచు కలవరపెడుతోంది. తితలీ తుఫాను తర్వాత ఉద్దానం ప్రాంతంలో నాలుగేళ్లుగా దిగుబడి పెద్దగా లేదు. ఈ ఏడాది జీడిపూత బాగా ఉండడం.. చెట్లకు పిక్కలు గుత్తులుగా కాయడంతో రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గతంలో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవచ్చుని భావించారు. అయితే రాత్రంతా పొగమంచు, మధ్యాహ్నం తీవ్ర ఎండలు కారణంగా జీడిపూత రంగుమారి రాలిపోతోంది. దీంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మరో నెలరోజులు ఇదే పరిస్థితి కొనసాగితే మొత్తం పంటంతా నాశనం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సరాసరి ఎకరాకు 80 కిలోల బస్తాలు నాలుగు నుంచి ఆరు వరకు పండుతాయి. ఏటా ప్రకృతి వైపరీత్యాలతో రైతులకు నష్టం వాటిల్లుతోంది. 2018లో తితలీ తుఫాన్ దెబ్బకు జీడి పంట అంతా కొట్టుకుపోయింది. రెండేళ్ల నుంచి కొత్త, పాత మొక్కలు కాపు కాస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 34వేల హెక్టార్లుల్లో జీడి సాగవుతోంది. ఉద్దానంలోని ఎర్రనేలల్లో జీడికి అనుకూలంగా ఉండడంతో రైతులు ఈ పంట జీవనాధారంగా సాగు చేస్తున్నారు. ఏటా జిల్లాలో పండే పంట చాలకపోవడంతో విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి జీడిపిక్కలు దిగుమతి చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలోని జీడి పరిశ్రమలకు మన పంట కేవలం 20 శాతం మాత్రమే ముడిసరుకు అందిస్తోంది. మిగిలిన 80 శాతం పిక్కలు వేరువేరు మార్గాలు ద్వారా రప్పించుకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది కూడా ఉద్దానం జీడి పిక్కలపై వ్యాపారులు ఆశలు పెట్టుకోకుండా ఇతర ప్రాంతాల ద్వారా జీడి పిక్కల కొనుగోలుకు చర్యలు ప్రారంభించారు. వాస్తవానికి విదేశీ పిక్కల కన్నా ఉద్దానం పిక్కలు మంచి దిగుబడితో పాటు రుచిగా ఉంటాయి. పొగమంచు కారణంగా ఈ ఏడాది దిగుబడి తగ్గే సూచనలు కనిపిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఉద్యానశాఖ అధికారులు స్పందించి జీడిపంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

భూ సేకరణతో సరి



మెళియాపుట్టిలో పరిశ్రమలకు కేటాయించిన భూమి

- కానరాని పరిశ్రమల ఏర్పాటు
- చొరవ చూపని ఏపీఐఐసీ, అధికారులు, నేతలు
- ఆక్రమణకు గురవుతున్న భూములు

(మెళియాపుట్టి)

వైసీపీ పాలనలో పరిశ్రమల ఏర్పాటు లేక నిరుద్యోగ యువతకు ఉపాధి కరువవుతోంది. టీడీపీ హయాంలో యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 2017లో మెళియాపుట్టిలోని సర్వే నెంబర్ 490లో 70ఎకరాలు ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ న్యూ పార్క్ కేటాయించింది. భూ సేకరణ ప్రక్రియ కూడా చేపట్టింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రాగా వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో పరిశ్రమలు ఏర్పాటు చేసి.. యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఈ నాలుగున్నరేళ్లలో పరిశ్రమల నిర్మాణం ఊసేలేదు. ఏపీఐఐసీ అధికారులు, పాలకులు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో భూములు సేకరించినా.. పరిశ్రమల నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదని గిరిజనులు వాపోతున్నారు. కుటీర పరిశ్రమలకు సైతం ప్రభుత్వం నుంచి సహకారం లేక ఎవరూ ముందుకురాని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. అప్పట్లో ఐటీడీఏ పీవోగా ఉన్న శివశంకర్ సైతం గిరిజన యువతకు సాంకేతిక శిక్షణ ఇచ్చి.. మెళియాపుట్టిలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమలో ఉపాధి కల్పిస్తామని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించడం లేదని గిరిజనులు నిరాశ చెందుతున్నారు. పరిశ్రమల కోసం గత ప్రభుత్వం కేటాయించిన భూమి ఆక్రమణకు గురవుతోందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం భూముల ధరలు పెరగడంతో అక్రమార్కులు ఈ స్థలాన్ని చదును చేసి ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఆక్రమణలు అడ్డుకుని.. పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.



మెళియాపుట్టిలో ఆక్రమణకు గురవుతున్న భూములు

ఎన్నో ఆశలు పెట్టుకున్నాం

పరిశ్రమలు ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆశ పడ్డాం. వైసీపీ ప్రభుత్వం వచ్చిన నిరాశే మిగిలింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం వస్తేనే.. పరిశ్రమలు నిర్మించే అవకాశం ఉంది.

- దినకర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ, మెళియాపుట్టి

పరిశ్రమలు నిర్మించాలి



పరిశ్రమలు నిర్మించి గిరిజనులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోవడం లేదు. గ్రామ వలంటీర్లు ఉద్యోగం తప్ప.. ఇతర అవకాశాలు లేవు.

-కృష్ణార్జునరావు, గిరిజన సంఘం నాయకుడు

పరిశ్రమలకు కేటాయించాం

మెళియాపుట్టిలో పరిశ్రమల ఏర్పాటు కోసం 70 ఎకరాలు కేటాయించాం. ఆ భూముల రక్షణ వారు చూసుకోవాలి. ఆక్రమణలపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం.

-చలపతిరావు, సర్వేయర్, మెళియాపుట్టి



ఘనంగా మహాలక్ష్మీతల్లి కల్యాణం

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు.. రణస్థలం మండలం కమ్మసిగడాం మహాలక్ష్మీతల్లి కల్యాణం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నడిపల్లి గ్రామానికి చెందిన సిద్ధాంతి కుటుంబీకులు అమ్మవారికి చీర, శతమానం సమర్పించారు. బంటుపల్లి మునసబు కుటుంబీకులు పల్లకిని తెచ్చారు. అనంతరం అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించగా.. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. కల్యాణం అనంతరం జాతర ప్రారంభమైంది. జేఆర్‌పురం సీఐ జీ.రామచంద్రరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

- రణస్థలం

అరసవల్లికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి, ఫిబ్రవరి 18: అరసవల్లి ఆదిత్యుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మాఘ ఆదివారం సందర్భంగా అధిక సంఖ్యలో తరలివచ్చి.. పూజలు చేశారు. ఇంద్రపుష్కరిణి వద్ద పాయసాలు వండి.. సూర్యదేవుడికి ప్రసాదాలు సమర్పించారు. క్యూలైన్లు, సూర్య నమస్కారాల మండపం భక్తులతో నిండిపోయింది. ఆదివారం ఒక్కరోజే ఆదిత్యుడికి రూ.7,06,116 ఆదాయం లభించింది. ఇందులో టికెట్ల విక్రయం ద్వారా రూ.2,92,300, పూజలు, విరాళాల ద్వారా రూ.1,57,741, ప్రసాదాల ద్వారా రూ. 2,57,075 లభించినట్లు ఈవో డీఎల్‌వీ రమేష్ బాబు తెలిపారు.

రథసప్తమి నాడు రూ.50.90 లక్షలు

అరసవల్లిలో ఈ నెల 16న నిర్వహించిన రథసప్తమి వేడుకల్లో ఆదిత్యుడికి రూ.50,90, 530 ఆదాయం లభించింది. అభిషేకం టికెట్ల ద్వారా రూ.12,00,000, విశిష్ట దర్శనం ద్వారా రూ.5,05,000, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.7,43, 000, విరాళాల ద్వారా రూ.57,690, కేశఖండన ద్వారా రూ.4,87,690 సమకూరింది. ప్రసాదాల ద్వారా రూ.14,12,580, వీఐపీ టికెట్ల ద్వారా రూ. 11,23,500 లభించినట్లు ఈవో తెలిపారు.



అరసవల్లిలో భక్తుల రద్దీ



నిద్దాలమ్మా.. చల్లగ చూడమ్మా

జి.సిగడాం మండలం నిద్దాంలో వెలసిన నిద్దాలమ్మ గ్రామదేవత వార్షికోత్సవ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమ్యాయి. గ్రామ శివారులో ఉన్న అమ్మవారికి వేలాదిమంది భక్తులు ముర్రాటలు చెల్లించి.. దర్శించుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నాటుబండిపై ఊరేగించారు. పసుపు, కుంకుమ, ముర్రాటలతో ఉత్సవ విగ్రహాన్ని శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం భీష్మఏకాదశి సందర్భంగా గ్రామంలో లక్ష దీపారాధన, భారీ అన్న సమారాధన, ఇంటింటికి అమ్మవారి చిత్రపటం పంపిణీ చేయనున్నారు. అలాగే ఐదు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

- జి.సిగడాం


వజ్రపుకొత్తూరు: కిడిసింగిలో టీడీపీలో చేరిన నాయకులతో శిరీష


సారవకోట మండలం బొంతు జంక్షన్‌లో మాట్లాడుతున్న రమణమూర్తి


పాతపట్నం: చాకిపల్లిలో టీడీపీలో చేరిన వారికి కండువాలువేసి ఆహ్వానిస్తున్న కలమట వెంకటరమణమూర్తి

వైసీపీ అరాచకాలకు చరమగీతం పలకాలి

● తెలుగుదేశం పార్టీ నాయకుల పిలుపు

రాష్ట్రంలో వైసీపీ అరాచకాలకు చరమగీతం పలకాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాలో పలుచోట్ల బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అలాగే పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు.

టీడీపీతోనే అన్నివర్గాలకూ న్యాయం: శిరీష

వజ్రపుకొత్తూరు: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గౌతు శిరీష తెలిపారు.రానున్న ఎన్నికలలో తమ పార్టీ విజయం తథ్యమని చెప్పారు. ఆదివారం మండలంలోని కిడిసింగిలో టీడీపీ మండల ముఖ్య నేతలు సమావేశం జరిగింది. కిడిసింగి గ్రామానికి చెందిన 40 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈసందర్భంగా శిరీష మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అధిక ధరలతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. మాజీ సర్పంచ్ నర్తు దానేష్ మాట్లాడుతూ కిడిసింగి పంచాయతీ టీడీపీ హయాంలోనే అభివృద్ధి చెందినట్లు పేర్కొన్నారు.మంత్రి అప్పలరాజు ఉత్తరకుమార ప్రగల్భాలే తప్ప కిడిసింగి గ్రామానికి చేసిన అభివృద్ధి ఏమిలేదన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొరక వసంతరావు, టీడీపీ నాయకులు విఠల్, వజ్జ బాబురావు. సూరాడ మోహనరావు. బుల్లోజు శశిభూషణ్, అర్సవెల్లి ఉమా మహేశ్వరరావు, నెయ్యిల సూర్యనారాయణ, కోనేరు ఆదినారాయణ పాల్గొన్నారు.

అలుపెరగని పోరాటం చేయాలి: బగ్గు

జలుమూరు(సారవకోట): రాష్ట్రంలో రావణ పాలనను అంతం చేసి రామరాజ్యం వచ్చే వరకూ టీడీపీ-జనసైనికులు కలిసి ముందడుగు వేసి వచ్చే ఎన్నికల్లో విజయ సాధించేవరకు అలుపెరగని పోరాటం చేయాలని నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు.సారవకోటమండలంలోని బొంతుజంక్షన్‌లో జనసేన ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ- జనసేన ప్రభుత్వం వస్తే ప్రజలు కష్టాలు తీరుతాయన్నారు.జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్ర మోహన్ మాట్లాడుతూ సుభాష్‌చంద్రబోస్ వలె నిరంకుశపాలనను గద్దె దించేందుకు టీడీపీతో కలిసి ప్రయాణం చేయాలన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి: కలమట

పాతపట్నం: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయడు పాలన తోనే రాష్ట్రంలో అభివృద్ధి పునఃప్రారంభమవుతుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కలమట వెంకటరమ ణమూర్తి తెలిపారు. ఆదివారం మండలంలోని చాకిపల్లిలో బాబు ష్యూరిటీ -భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీచేశారు. అనంతరం రచ్చబండను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధికి తిలోదకాలు ఇచ్చారని ఆరోపించారు. కాగా చాకిపల్లిలో వైసీపీని వీడిగ్రామానికి చెందిన వార్డు సభ్యుడు లక్ష్మీనారాయణ, ఆజారి కరువులు, పొత్రుకొండ లక్ష్మీనారాయణ, వండాన శేఖరరావు, మంగి అప్పారావు, మంగి సంతోష్, మామిడి నరసింహులు, లుకలాపు జగదీష్‌లతో సహా 30కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి వెంకటరమణమూర్తి పార్టీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీలో ప్రజల సమస్యలను వినే నాథుడే లేడన్నారు.

ఎండిన చెరువులు

● అడుగంటిన భూగర్భజలాలు ● ఫిబ్రవరిలోనే నీటి ఎద్దడి

● ఇదీ పలాస మండలంలో పరిస్థితి


అల్లుకోల వద్ద అడుగంటిన హరిసాగరం

పలాస రూరల్: పలాస మండలంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నీటిఎద్దడి నెలకొంది. నైరుతు, ఈశాన్య రుతుపవనాల సమయంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురకవపోవడంతో జలాశయాల్లో పూర్తిస్థాయిలో నీరు చేరలేదు. ఉన్న కొద్దిపాటి నీరు ఖరీఫ్‌లో సాగుకు వినియోగించారు.దీంతో ఈఏడాది ఫిబ్రవరి రెండోవారంలోనే చెరువులు ఎండిపోయాయి. దీంతో భూగర్భ జలాలు అడుగుతంటుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

పలాస మండలంలో గత ఏడాది వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఈ ఏడాది ఫిబ్రవరికే బావుల్లో నీరుగంటిపోయింది. బోరుబావుల్లో నీటిమట్టాలు పడిపోయాయి. గతఏడాది సెప్టెంబరు ఏడో తేదీ నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో చెరువులు, జలాశయాలు నిండలేదు. మండలంలోని ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న హరిసాగరం పూర్తిగా ఎండిపోయింది. లొత్తూరుసాగరం, వరహాల గెడ్డలు కూడా అడుగంటిపోయాయి. పదిరోజుల్లో పూర్తి స్థాయిల్లో ఎండిపోయే అవకాశముంది. ఎల్‌నినో ప్రభావంతో గతఏడాది నైరుతి రుతుపవనాలు విఫలమయ్యాయి. దీంతో సగటు వర్షపాతం కూడా నమోదుకాలేదు. దీంతో వర్షాకాలంలోనే అగచాట్లు పడాల్సివచ్చింది. అయితే ఫిబ్రవరి మొదటివారం నుంచే ఉష్ణోగతలు పెరగడంతో నీటిఎద్దడి నెలకొంది.


మహాదేవపురం వద్ద ఎండిపోయిన చెరువు

బోరుబావులే ఆధారం..

మండలంలో గతంలో బావులపై ఆధారపడ్డ ప్రజానీకం ప్రస్తుతం బోరు బావులపై ఆధారపడుతున్నారు. గ్రామాల్లో గతంలో ఉండే పెద్దబావులు పెద్ద బావులు నీటి అవసరాలు తీర్చేవి. ప్రస్తుతం నిర్వహణలోపం వల్ల నేల బావులు అంతరిస్తున్నాయి. కొన్నిగ్రామాల్లో మాత్రమే బావులపై ఆధారపడుతున్నారు. వర్షాభావం వల్ల ఉద్దానం నీటి పథకం ద్వారా గ్రామాలకు తాగునీరు ఈ ఏడాది పూర్తిస్థాయిలో అందుతుందా లేదా అన్న సందేహాలు నెలకొన్నాయి. అక్టోబరు, నవంబరులో ఒడిశా కొండల నుంచి వచ్చే నీరు తగ్గిపోవడంతో ప్రస్తుతం జలాశయాలు బోసిపోతున్నాయి. దీంతో ఈఏడాది వేసవిలో తీవ్ర నీటిఎద్దడి తప్పదని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాది వేసవిలోనైనా హరిసాగరం, లొత్తూరు రిజర్వాయరు, వరహాలగెడ్డల్లో పూడికలు తీసిలోతు చేస్తే రానున్న వర్షాకాలం నీరు నిల్వకు అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

బాలికపై అత్యాచారం

పర్లాకిమిడి : గజపతి జిల్లా గుసాని సమితిలోని ఓ గ్రామంలో 15ఏళ్ల బాలికపై అత్యాచారం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు అనుమానితుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పర్లాకిమిడిలో బీజేడీ ర్యాలీ


ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

ఒడిశా

పర్లాకిమిడి: పర్లాకిమిడిలోని బీజూజనతాదళ్ (బీజేడీ) కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ బందుదాస్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు హైటెక్ విద్యాసంస్థల డైరెక్టర్ రూపేష్ పాణిగ్రాహిని రాష్ట్ర బీజూయువ జనతాదళ్ (బీవైజేడీ)ఉపాధ్యక్షుడిగా నియమితులు కావడంతో అభినందించారు.రెండు వేల మందితో భారీ ర్యాలీ చేపట్టారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూపేష్ పాణిగ్రాహి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే నెంబర్-1 ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మునిసిపాలిటీ అధ్యక్షులు నిర్మలాశెట్టి, ఉపాధ్యక్షుడు లెంకమధు, గుసాని సమితి అధ్యక్షుడు వీర్రాజు, గణపతిరావు, బలరాజు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి: పీడీ


మాట్లాడుతున్న చిట్టిరాజు

నరసన్నపేట:జాతీయ ఉపాధిహామీపథకంలో భాగంగాచేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో సిబ్బంది నిత్యం పరిశీలించాలని, కొలతలు సక్రమంగా వేయాలని డుమా పీడీ చిట్టిరాజు సూచించారు. ఆదివారం నరసన్నపేటలోని కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫీల్డ్‌అసిస్టెంట్లు పనులు వద్ద లేకపోవడంతో నామమాత్రంగానే జరుగుతున్నాయని తెలిపారు. కూలీలతో సక్రమంగాచేయించాలని సూచించారు. మేట్లుపనులు ప్రాంతాల్లో అప్రమత్తం ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో యుగంధర్, అప్పలరాజు ఆదితరులు పాల్గొన్నారు.

పెద్దసీదిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనం నిర్వహిస్తున్న 1985-86 పూర్వవిద్యార్థులు

పాతపట్నం: మండలంలోని పెద్దసీది జడ్పీ ఉన్నతపాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు.ఈసందర్భంగా వారంతా ఆనాటిజ్ఞాపకాలను గుర్తుచేసుకొన్నారు. ఆటపాటలతో సందడిచేశారు. గ్రామంలో సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు తీర్మానించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎల్ఎన్‌కొల్లి ఆధ్వర్యంలో ఆనాటి ఉపాధ్యాయులు పొన్నాన శిమ్మన్నతోపాటు పలువుర్ని సత్కరించి సన్మానించారు.

సొసైటీ రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

పోలాకి: పోలాకి సహకార సొసైటీ ద్వారా తీసుకున్న రైతుల రుణాలను ఈనెల 29లోగా రెన్యూవల్‌చేసుకోవాలని డీసీసీబీ ఛైర్మన్ కరిమిరాజేశ్వరరావు, సీఈవో బంటుపల్లిరాంబాబు తెలిపారు.పోలాకివారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల29లోగా రెన్యువల్‌చేస్తే 8శాతం వడ్డీచెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

ఓటర్ల నమోదుకు దరఖాస్తులు: తహసీల్దార్

పోలాకి: ఓటర్ల జాబితాలో ఓటు హక్కు కల్పించే వీలుగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్నికల తహసీల్దార్ ఎస్ఎల్‌వీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం పోలాకిలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకమిషన్ నూతన ఓటర్లనమోదుతోపాటు మార్పులు, చేర్పులు,దిద్దుబాటుకు అవకాశంకల్పించిందని చెప్పారు. సంబంధిత సచివాలయ వీఆర్వో,బీఎల్వోవద్దకు వెళ్లి అవకాశం వినియోగించుకోవాలని కోరారు.పోలింగ్ బూత్‌ల వద్ద వసతి సదుపాయాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మరుగుదొడ్డి ఏర్పాటుచేయాలని తెలిపారు. బీఎల్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించామని పలుసూచనలుచేశామన్నారు. సమావేశంలో డీటీ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్వోల సంఘం నాయకులు ప్రగడవేణు, జగన్నాథం పాల్గొన్నారు.

నేడు అచ్చెన్న రాక

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం నియోజకవర్గానికి రానున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఉంటారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి కోటబొమ్మాళి మండలం బంజీరుపేటలో, ఐదు గంటలు తరువాత సంతబొమ్మాళి మండలం తోటాడ, నర్సాపురం పంచాయతీలో ఎం.నర్సాపురం, ఆకులసతి వానిపేట, యర్నాగులపేటల్లో పర్యటిస్తారని పొలిటికల్ పీఏ లాడి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

'పది' పరీక్షలపై భయం వీడాలి

నరసన్నపేట:పదోతరగతి విద్యార్థులు పరీక్షలపై భయం విడనాడాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు మాకేన సతీష్ తెలిపారు. ఆదివారం పట్టణంలో ఓ కల్యాణ మండపంలో పదోతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధిస్తామనే ఆత్మవిశ్వాసంతో చదివితే విజయ తథ్యమ న్నారు. మానసిక ఒత్తిడికి లోను కారాదని సూచించారు.

నరసన్నపేటలో అబాకస్ పోటీలు

నరసన్నపేట: పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో జిల్లాస్థాయి అబాకస్, వేదగణిత పరీక్ష పోటీలను ఆదివారం నిర్వహించారు. జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు వేదగణిత పరీక్షలను రాశారు. జిల్లాస్థాయిలో ప్రతిభకనపరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

రేపటి నుంచి కనక దుర్గాభవానీ జాతర

పోలాకి: పోలాకిలో కనకదుర్గాభవానీ జాతరఉత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశామని ఆలయ ధర్మకర్తలు టంకాలశ్రీరాములు, పల్లిరాజుభవానీ తెలిపారు. ఐదురోజులపాటు జరిగే ఉత్సవాలకు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జాతరకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి నుంచి వేలసంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లుచేస్తున్నారు.మంగళవారం నుంచిశనివారం వరకూ జరిగే జాతరలో హోమాలునిర్వహిస్తారని అర్చకులు పెంటకిరణ్‌కుమార్‌శర్మ తెలిపారు.

రాళ్లుతేలి.. అధ్వానంగా మారి

● పాడైనా మరమ్మతులకు నోచుకోని వైనం

● ఇదీ కంచిలి మండలంలోని గిరిజన, గ్రామీణ ప్రాంత రోడ్ల దుస్థితి

కంచిలి: మండలంలోని రహదారులు రాళ్లుతేలి, అధ్వానంగా మారాయి. 30 పంచాయతీల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో గిరిజనులు, వాహనచోదకులు, ప్రయాణికులు అగచాట్లకు గురవుతున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేన్నరేళ్ల గడుస్తున్నా పలు గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం కల్పించలేదని పలువురు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి చినుకులు పడితే బురదమయవుతున్నాయి. టీడీపీ హయాంలో మండలంలోని పలు గ్రామీణరహదారుల నిర్మాణానికి నిధులు మంజూరుచేసినా ఇప్పటి వరకు పనులు పూర్తిచేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.


మరమ్మతులకు నోచుకోని అంపురం రహదారి

ఇదీ పరిస్థితి..

● కంచిలి మెయిన్ రోడ్డు పూర్తిగా గోతులమయంకావడంతో నిత్యం వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ● జాతీయరహదారి నుంచి అంపురం మీదుగా ఎంఎస్‌పల్లి వెళ్లే రహదారి గోతులమయమైంది. ఇటీవల కొన్నిచోట్ల తారు వేసి మరమ్మతులు చేపట్టినా కొద్దిరోజులకే మళ్లీ గోతులు ఏర్పడ్డాయి. ● ఎంఎస్‌పల్లి నుంచి దాశేశ్వరం వెళ్లే రహదారి చినుకులు పడితే బురదమయం అవుతుండడతో నరకాన్ని తలపిస్తోందని పలువురు వాపోతున్నారు. ఈ రహదారి మీదుగా ఎంఎస్‌పల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. ● జలంత్రకోట నుంచి రఘుపురం, చిలకలమెట్ట తదితర గ్రామాలకు వెళ్లే రహదారి సైతం పూర్తిగా గోతులమయమైంది. దీన్ని తారురోడ్డుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.● నువ్వాగడ, తుత్తాసాయి, బొగాబెణి తదితర గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. రాళ్ల తేలడంతో పాదచారులు నడవలేకపోతున్నామని వాపోతున్నారు. కంచిలి నుంచి గొల్ల కంచిలి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. కాగా నువ్వాగడకాలనీ, కంచిలి మెయిన్‌రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయలు చొప్పున మంజూరుకావడంతో టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ ఏఈ మోహనరావు తెలిపారు.


గోతులమయమై రాళ్లుతేలిన నువ్వాగడ రహదారి

భక్తిభావం పెంపొందించుకోవాలి

టెక్కలి: ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని ప్రవచనకారులు నరసన్నపేట విద్యాశ్రయానికి చెందిన అనుష్టానందస్వామి, సింగుపురం దివ్య జీవన సంఘానికి చెందిన ప్రకాశనందస్వామి, టెక్కలి కాశీవిశ్వేశ్వర ఆలయానికి చెందిన నర్సింహస్వామి, ఊడికలపాడు రామకృష్ణ రమణ కరుణ గీతాశ్రయానికి చెందిన సనపల కరుణ్‌కుమార్ తెలిపారు.ఆదివారం కోటబొమ్మాళి మండలంలోనివింజాంపాడు రామమందిరంలో నిర్వహించిన సత్సంగంలో మాట్లాడారు.సమాజంలో నానాటికి పెరుగుతున్న రుగ్మతలను రూపుమాపి మానవాళినిసన్మార్గంలో నడిపించేందుకు సత్సంగ సమావేశాలు దోహదపడతాయన్నారు.మధ్యాహ్నం చింతాడ కృష్ణమూర్తి,ఆరుద్రమ్మల ఆర్థిక సహాయంతో నారాయనసేవ నిర్వహించారు. కార్యక్రమంలో హనుమంతు సింహాద్రినాయుడు, హనుమంతు లక్ష్మనాయుడు పాల్గొన్నారు.

బొర్రంపేటలో కుంకుమ పూజలు


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఎల్.ఎన్.పేట:మండలంలోని బొర్రంపేట బొర్రశంకరగిరి క్షేత్రం స్వామి వారి ప్రతిష్ఠోత్సవంలో భాగంగా ఆదివారం మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని వలసపాడు, మల్లిఖార్జునపురం, ముంగెన్నపాడు మొదలైన గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

ఉర్లాంలో వెంకన్న కల్యాణం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం ఎస్సీ కాలనీలో శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవం చామర్తి శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. సుప్రభాతసేవ, అర్చనలు చేపట్టిన తర్వాత వేంకటేశ్వరస్వామి శాంతికల్యాణం నిర్వహించి అనంతరం పూర్ణాహుతి చేశారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలు

నందిగాం:నందిగాం మధురసుబ్బమ్మపేటలో కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు ధర్మకర్త కేకే రంగనాథాచార్యులు,ఆలయఅర్చకులు కె.రామానుజాచార్యులు తెలిపారు. భీష్మఏకాదశి పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం స్వామివారి కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. ఆలయంలో సోమవారం బాలసీమకు చెందిన వేదపండితులు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో పూజలు ప్రారంభమవుతాయని తెలిపారు.

రేపటి నుంచి దిమ్మిడిజోలలో రామమందిర పునఃప్రతిష్ఠోత్సవాలు

నందిగాం మండలంలోని దిమ్మిడిజోలలో శ్రీరామమందిర పునఃప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు విగ్రహాల గ్రామప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవచనం, మధ్యాహ్నం రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతీ స్వామి, కాపుతెంబూరు దత్తాశ్రమం పీఠాధిపతి నిర్విస్యానంద స్వామీతో ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాయంత్రం సంగీత కచేరి ఉంటాయని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో భగీరథపురం వాసి మృతి

హిరమండలం:ఉపాధికోసం హైదరాబాద్ వెళ్లిన ఓ యువకుడు అక్కడ ప్రవదవశాత్తు మృతిచెందిన సంఘటన ఆదివారం తీవ్ర విషదాన్ని నింపింది. కుటుంబసభ్యుల కథనంమేరకు.. మండలంలోని భగీరథపురం కాలనీకి చెందిన కొల్లి శంకరరావు(26) ఉపాధికోసం హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ కుకట్‌పల్లిలో లోన్ కన్సల్టెన్సీ బిజినెస్‌ను ఏర్పాటుచేసుకున్నాడు. శనివారం సాయంత్రం కన్సల్టెన్సీ కార్యాలయానికి పేరుతో కూడిన ఫ్లెక్సీఏర్పాటుచేస్తున్నాడు. ఈ సమయంలో ఫ్లెక్సీ బోర్డుకుపైన ఉన్న హైటెన్షన్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ నేపథ్యంలో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి అంబులెన్స్‌లో గ్రామానికి తీసుకువస్తున్నారు. శంకరరావుకుటుంబ సభ్యులను టీడీపీ రాష్ట్ర కారదర్శి కలమట సాగర్ పరామర్శించారు.

చికిత్సపొందుతూ రైతు..

నరసన్నపేట: మండలంలోని బొరిగివలసలో పాముకాటుకు గురై రైతు పొన్నాన నాగేశ్వరరావు (53) చికిత్సపొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. చోడిపంటకు శనివారం ఉదయం పురుగుల మందును పిచికారీ చేస్తున్న సమయంలో కాలుకు పాము కాటు వేసింది. దీంతో అపస్మారస్థితిలో పొలంలో నాగేశ్వరరావు పడిపోయాడు. ఇంటికి ఎప్పటికి రాకపోవడంతో భార్య అన్నపూర్ణ పొలంలో అపస్మారక స్థితిలో పడిఉన్న భర్తను గుర్తించి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో కుటుంబసభ్యులస్థానికుల సాయంతో చేర్పించారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిఫర్ చేయగా కుటుంబసభ్యులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేశ్వరరావు ఆదివారం తెల్లవారు జామున మృతిచెందాడు. నాగేశ్వరరావుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోషించే పెద్ద దిక్కుకోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా కుటుంబసభ్యులు రోదిస్తున్నారు.

సంపులో జారిపడిన ఎలుగుబంటి పిల్ల


సంపులో పడిన ఎలుగుబంటి పిల్ల

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పంచాయతీ పరిధిలోగల శివరాంపురం సమీపంలో కొండపక్కనఉన్న సంపులో ఎలుగుబంటి పిల్ల ఆదివారం జారిపడింది. ఇటీవల ఈ ప్రాంతంలో తరచూ ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎలుగుబంటి పిల్ల సంపులో జారిపడడంతో గ్రామస్థులు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖాధికారులు, సంతబొమ్మాళి పోలీసులు ఎలుగుబంటి పిల్లను సంపు నుంచి తీసి పక్కన ఉన్న కొండపై విడిచి పెట్టారు. తప్పిపోయిన పిల్ల కోసం తల్లి ఎలుగుబంటి సంచరిస్తుందేమోనన్న గ్రామస్థులు బయటకు రావడానికి భయాందోళన చెందుతున్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, శ్రీకాకుళం : 9985411535
రాజాం : 9494691912, పలాస : 9985411532



ఆరు నెలలుగా మురుగులోనే..



యాళ్లవీధి రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ఆమదాలవలస: సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు వైసీపీ నాయకులు బాకాలు ఊదుతున్నారు. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేద నడానికి ఈ ఫొటోలే నిదర్శనం. ఆమదాలవలస పురపాలక సంఘంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. ఎక్కడికక్కడ కాలువలు మూసుకుపోవడంతో మురుగునీరు రోడ్లపైనే నిలిచిపోతుంది. మున్సిపాలిటీ పరిధి ఏడో వార్డు చింతా డలోని యాళ్లవీధి రహదారిపై గత ఆరు నెలలుగా మురుగునీరు నిల్వ ఉండడం తో ఆ వీధివాసులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడి పరిస్థితిని మున్సిపల్ అధికారుల వద్ద మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని ఆ వీధివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే 8వ వార్డులోని బీఆర్ నగర్‌లో గృహ నిర్మాణాలకు పదేళ్లుగా ప్లాన్ అనుమతులు ఇస్తున్నా నేటికీ కాలువలు నిర్మించక పోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. దీంతో ఇంటి ముందే మురుగు నీటిని మళ్లించడానికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుం టున్నారు. ఇలా ఏర్పాటు చేసుకున్న వారికి నోటీసులు ఇవ్వడంపై వారంతా ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ బాగు చేస్తామని స్పీకర్ ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చకపోవడం విశేషం.

కబడ్డీ జట్ల ఎంపిక



పోటీపడుతున్న క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి పురుషులు, సబ్ జూనియర్ బాలురు, బాలికలు కబడ్డీ జట్ల ఎంపికలకు 160 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మ్యాట్ పై సాగిన ఈ ఎంపికల్లో పురుషుల నుంచి 40 మంది క్రీడాకారులు పాల్గొనగా, సబ్ జూనియర్ బాలురు, బాలికలు 120 మంది పాల్గొన్నారు. పురుషులకు 85 కిలోల బరువు, సబ్ జూనియర్స్‌కు 65 కిలోలు బరువు నిర్ణయించి వయస్సు ప్రాతిపదికను ఎంపికలు నిర్వహించారు. తొలుత అన్ని జట్లకు ఎంపికలు నిర్వహించి ప్రాబుల్స్ జట్లను ప్రకటించి, ఇందులో మెరుగైన ఆటతీరును ప్రదర్శించిన వారికి తుది జట్టులో చోటు కల్పి స్తారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో ఆ సంఘం కార్యదర్శి సాధు శ్రీనివాస రావు పర్యవేక్షణలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, సెలక్టర్లుగా వ్యాయామ ఉపాధ్యాయులు టి.తవిటమ్మ, ఎస్.రమేష్, ఎం.తిరుపతిరావు, ఎస్.నీలయ్య, సీహెచ్ ఫల్గుణరావు, జగన్నాథం, ఎస్.రమేష్, ముసలినాయుడు పాల్గొన్నారు.

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

'సూపర్ సిక్స్'తోనే సంక్షేమ పాలన

● మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

అరసవల్లి: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలు ద్వారా సంక్షేమ పాలన సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి అన్నారు. ఆదివారం నగరంలోని 50వ డివిజన్‌లో గల సీపన్నాయుడుపేటలో మాజీ కౌన్సిలర్ సీపాన మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో ప్రజలకు కష్టాలు, కన్నీళ్లే మిగిలాయని అన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక సమస్యల పరిష్కారంలో ముందుంటామని హామీ ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి హామీ పత్రాలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే హామీలను వివరించారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు సీపార రమేష్‌కుమార్, సీపాన దాలినాయుడు, కంచరాన కన్నారావు, కూన త్రినాథ్, పూజారి రామ్మూర్తి, సీపాన హరినారాయణ, సీపాన రామారావు, సీతారాం, సనపల జగదీశ్వరరావు, శ్రీరాములు, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: డీఆర్ వలసలో



కంచిలి: అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు



అరసవల్లి: సీపన్నాయుడుపేటలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పార్టీ శ్రేణులతో ప్రచారం

పోలేరు పంచాయతీలో బాబు ష్యూరిటీ..

కంచిలి: పోలేరు పంచాయతీలో స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు, తెలుగు యువత సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఊనా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే సంక్షేమం

జి.సిగడాం: రాష్ట్రంలో సంక్షేమం విజన్‌గల నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి టంకాల మౌళీశ్వరరావు అన్నారు. ఆదివారం డీఆర్ వలస, టీడీ వలస, నిద్దాం, పెంట, బాతువ తదితర గ్రామాల్లో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతిపాలయిందన్నారు. ఒక్కఛాన్స్‌తో రాష్ట్రాన్ని అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పైల రామకృష్ణంనాయుడు, కూనుబిల్లి కూర్మారావు, మక్క నారాయణరావు, మీసాల అశోక్, మక్క అన్నంనాయుడు, మీసాల రమణారావు, మీసాల విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్: ఎచ్చెర్ల మండల వైసీపీ నేత, ఎచ్చెర్ల మాజీ సర్పంచ్ జరుగుళ్ల శంకరరావుపై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి ఆరుగురిని అరెస్టు చేసి ఆదివారం కోర్టులో హాజరుపర్చారు. ఎచ్చెర్ల ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటనలో ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి, నేతింటి సత్యనారాయణ (ఎచ్చెర్ల), పంచిరెడ్డి కైలాస్ (శ్రీకాకుళం), అలబాన మణి (శ్రీకాకుళం), కలగ ఉమామహేశ్వరరావు (పెద్దపాడు). సీపాన లక్ష్మణ (కింతలి మిల్లు)లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్టు చెప్పారు. రాజకీయ వైరంతోనే శంకరరావుపై దాడి జరిగిందన్నారు. ఎంపీపీ చిరంజీవి ప్లాన్‌లో భాగంగానే దాడి జరిగిందన్నారు. మండల పరిషత్ ఎన్నికల నాటి నుంచి వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరుకొనసాగుతుంది. శంకరరావు కదలికలను కొద్ది రోజులుగా గమనించేందుకు రెక్కీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ నెల 9వ తేదీన సాయంత్రం శంకరరావు ఎస్ఎం పురం రోడ్‌లోని తన పొలంలో నిర్మాణ పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా.. వెనుక నుంచి అలబాన మణి, కలగ ఉమామహేశ్వరరావు మోటారు బైక్‌తో వెంబడించారు. పొలంలో ఉండగానే శంకరరావును హతమార్చాలని ప్రయత్నించారు. అయితే మణి, ఉమామహేశ్వరరావు అనుకున్న సమయానికి కాసేపు ఆలస్యంగా అక్కడికి చేరుకున్నారు. కాగా, శంకరరావు, అదే గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తితో మోటారు బైక్‌తో తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో శంకరరావుపై దాడిచేశారు. ఈ దాడిలో శంకరరావు తీవ్రంగా గాయపడి అక్కడి నుంచి నేరుగా శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చేరుకున్నారు. శంకరరావు భార్య వైస్ ఎంపీపీ జరుగుళ్ల విజయకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారించగా.. ఈ ఘటనలో ఆరుగురు వ్యక్తులు బాధ్యులుగా గుర్తించినట్టు, రూ.3 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో నిందితులకు వచ్చే నెల 2వ తేదీ వరకు న్యాయస్థానం రిమాండ్ విధించింది.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న రఘురామ్

జి.సిగడాం: సార్వత్రిక ఎన్నికల శంఖారావంలో కేంద్ర పథకాలును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు, విశ్వకర్మ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వజ్జపర్తి రఘురామ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల నాయకుల సమావేశం అయన మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు ప్రజాపోరు యాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. అందుకు ప్రతీ కార్యకర్త సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. పేదల కోసం ప్రధాని మోదీ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకాలు ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 27న ఎచ్చెర్ల నియోజకవర్గం పైడిభీమవరంలో నిర్వహించనున్న బహిరంగ సభకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరు కానున్నట్టు, అందుకు మండలం నుంచి బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో విజయనగరం పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనివాసరావు, నియోజకవర్గ కోకన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు, ప్రజాపోరు కోకన్వీనర్ మీసాల రామకృష్ణ, నాయకులు తాడేల గౌరినాయుడు, తుమ్మగుంటల జగదీశ్వరరావు, పొగిరి దాశరథి, గట్టెం అప్పలరాజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం



మట్టితో గుంతలు పూడ్చుతున్న యువకులు

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల నుంచి కొయ్యాం గ్రామానికి వెళ్లే రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. సుమారు గ్రామ పంచాయతీల ప్రజలు ఇదే రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో, మలుపులతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంగా ఉంటుంది. ప్రయాణికుల అవస్థలను గమనించిన చినరావుపల్లి గ్రామ యువకులు స్వచ్ఛందంగా మట్టితో మరమ్మతులు చేపట్టారు. యువకుల శ్రమదానాన్ని పలువురు అభినందించారు.

రామస్మరణతో సుఖసంతోషం



రామస్మరణ నిర్వహిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: భారతదేశంలో మార్మోగుతున్న శ్రీరామస్మరణతో సకల సుఖసంతోషాలు కలుగుతాయని రొట్టవలస శ్రీరామానందాశ్రమ వ్యవస్థాపక గురుస్వామి తొత్తడి వెంకటరమణ అన్నారు. ఆదివారం ఆశ్రమంలో శ్రీరామ సత్సంగం నిర్వహించారు. ప్రతి నెలా మూడో ఆదివారం నిర్వహిస్తున్న ఈ సత్సంగానికి రొట్టవలస, కొండవలస, రావివలస, బొరగవలస, దన్నానపేట, సలంత్రి, కూన జమ్మన్నపేట గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆశ్రమంలో నారాయణసేవ భోజన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తాడేల వెంకటరమణ, రిటైర్డు ఉపాధ్యాయుడు తొత్తడి వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం ఎంఈవోకు నోటీసులు

ఇచ్ఛాపురం: మున్సిపాల్టీ పరిధిలో గల లాలాపేట ప్రాథమిక పాఠశాల, భవానీపురం ప్రైమరీ పాఠశాలను ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం తనిఖీలు చేపట్టారు. అయితే పాఠశాలల నిర్వహణ, తనిఖీలు, విద్యార్థులు చదువులు బాగులేకపోవడంతో తీవ్ర అసం తృప్తికి లోనైన ప్రవీణ్‌ప్రకాష్ ఆర్‌జేడీ, డీఈవో, డిప్యూటీ డీఈవోలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ఎంఈవో అప్పారావు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆర్‌జేడీ జ్యోతికుమారి ఆదివారం నోటీసులు జారీ చేసి వివరణ ఇవ్వాలని కోరారు.





టెలికాం చీఫ్, రైల్వే అధికారులకు స్వామివారి చిత్రపటాన్నిస్తున్న దేవస్థానం అధికారులు

ఆదిత్యుని దర్శించుకున్న ప్రముఖులు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఆదివారం విశాఖ రేంజ్ డీఐజీ రవిశంకర్, విజయవాడ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం, సౌత్ సెంట్రల్ రైల్వే అధికారి ఉన్నం అక్కిరెడ్డి(ఐఆర్ఎస్) వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ స్వాగతం పలుకగా ఆలయ అర్చకులు వేదమంత్రాల తో ఆశీర్వదించారు. వారికి స్వామివారి జ్ఞాపికలను ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు, ఆలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు అందజేశారు.



గార: డీఐజీకి స్వామి వారి చిత్ర పటాన్ని అందిస్తున్న ప్రధాన అర్చకులు

● **గార:** శ్రీకూర్మంలోని కూర్మనాథుని ఆదివారం ఉదయం విశాఖ రేంజ్ డీఐజీ రవిశంకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని చిత్ర పటాన్ని ప్రధాన అర్చకులు సీతారామనర్సింహాచార్యులు అంద జేశారు. కార్యక్రమంలో సీఐ ఎల్ఎస్ నాయుడు, గార ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల వెల్ఫేర్‌ఫండ్ రూ.10లక్షలకు పెంచాలి

అరసవల్లి: న్యాయవాదుల డెత్ వెల్ఫేర్ బెనిఫిట్ ఫండ్‌ను రూ.10లక్షలకు పెంచాలని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు జి.శాంతకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బార్ కౌన్సిల్ ఏకపక్షంగా అడ్వకేట్ వెల్ఫేర్ డెత్ బెనిఫిట్ ఫండ్‌ను రూ.4లక్షల నుంచి రూ.5లక్షలకు మాత్రమే పెంచిందని, ఇది సరికాదన్నారు. న్యాయవాదుల ఉద్యమం వల్ల రూ.20ల వెల్ఫేర్ స్టాంపును ఉపసంహరించుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

'జూపూడి.. దళిత ద్రోహిగా మిగిలిపోతావు'

అరసవల్లి: విదేశీ విద్య పథకానికి అంబేడ్కర్ పేరుని తొలగించి వైఎస్ఆర్ పేరు పెట్టడం సంతోషంగా ఉందని, జగన్ పేరు పెట్టినా తనకు ఆనందమేనని అంటున్న ప్రభుత్వ న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు దళిత ద్రోహిగా మిగిలిపోతావని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు విమర్శించారు. ఆదివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అంబేడ్కర్ కన్నా తనకు డబ్బే ముఖ్యమని వ్యాఖ్యానించడం యావత్తు దళిత జాతి సిగ్గుపడుతోందన్నారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం ద్వారా చదివి, ఉద్యోగాన్ని పొంది, అదే రాజ్యాంగం ద్వారా ఎమ్మెల్సీ పదవి పొంది ఇప్పుడు జగన్‌రెడ్డి మెప్పు కోసం అంబేడ్కర్‌ను కించపరచడం దళిత జాతికే అవమానమని ధ్వజమెత్తారు. ఈ ఐదేళ్లలో దళితులపై జరిగిన దాడులు, అత్యాచారాలు, హత్యలు నీకు కనబడలేదా అని నిలదీశారు. దీనికి రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం తప్పదన్నారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

ఇచ్ఛాపురం: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ ఇమ్మాన్యుయల్ రాజు రౌడీ షీటర్లను హెచ్చరించారు. ఆదివారం సర్కిల్ కార్యాలయం వద్ద సర్కిల్ పరిధిలో గల ఇచ్ఛాపురం టౌన్, రూరల్, కవిటి మండలాల్లోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మంచి ప్రవర్తన కలిగి ఉన్నవారికి రౌడీషీట్ నుంచి పేర్లు తొలగిస్తామన్నారు. రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకొనేలా సహకరించాలన్నారు. అంతా మంచి ప్రవర్తన కలిగి ఉంటామని రౌడీ షీటర్లుతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్, కవిటి ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి బీజేపీ ప్రజాపోరు



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఎచ్చెర్ల: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై ప్రజలకు వివరించేందుకు బీజేపీ ఈ నెల 21 నుంచి ప్రజాపోరును నిర్వహిస్తున్నట్టు విజయనగరం పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనివాసరావు, ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ కో కన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు తెలిపారు. ఎచ్చెర్లలో ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు ప్రజాపోరు పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 29న పైడిభీమవరంలో నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పుణ్యపు శంకర్, పార్టీ నేతలు తమ్మినేని గోవిందరావు, వావిలపల్లి చంద్రరావు, జీరు శ్రీనివాసరెడ్డి, కొణతం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న వ్యక్తులు

ఆమదాలవలస: తెలుగుభాషను అభివృద్ధి చేయాలని ఎల్ఎన్ పేట ఎంఈవో కుప్పిలి చంద్రమౌళి, రిటైర్డు ఉపాధ్యాయులు బగాది వెంకటరావు అన్నారు. పట్టణంలోని బీఆర్ నగర్‌లో ఉన్న గ్రంథాలయంలో మాతృభాషా దినోత్సవంపై సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ నెల 21న మాతృభాషను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. వాడుక భాషలో ఉన్న తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వీవీఎస్ మా స్టార్, విశ్వసాహితీ ముఖ్యకార్యదర్శి కర్నేన జనార్దనరావు, ఎస్.చంద్రశేఖరం, తమ్మి నేని సూర్యనారాయణ, ఎస్.వాసుదేవరావు, పూజారి సూర్యనారాయణ, పూజారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్ పఠనంతోనే జీవిత సాఫల్యం



సమావేశంలో పాల్గొన్న ముస్లిం పెద్దలు

శ్రీకాకుళం కల్చరల్: ఖురాన్ పఠనంతోనే జీవిత సాఫల్యం కలుగుతుందని ముఫస్సిరుల్ ఖురాన్ హజ్రత్ మౌలానా సయ్యద్ రషీద్ నసీమ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చంపావీధిలో గల మసీద్‌లో మదరసాలో ఐదుగురు విద్యార్థులు హఫీజ్-ఎ-ఖురాన్ డిగ్రీని సాధించారు. ఈ సందర్భంగా ముస్లిం ఇమామ్‌లు దస్తర్ బందీ కార్యక్రమాన్ని ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మదరాసా ద్వారా మనిషికి మానవత్వం, మంచితనం నేర్పుతామన్నారు. ఎన్ని పుస్తకాలు చదువుకున్నా ఖురాన్ పఠించనిదే జీవిత సత్యం తెలియదన్నారు. కార్యక్రమంలో మౌలానాలు హమ్మద్ ఇలియాజ్, అహ్మద్, ముఖ్‌బుల్, హుస్సేన్, అహ్మద్, అబ్దుల్ కలామ్, హాజీ షాన్‌వాజ్, మహిబుల్లా ఖాన్, మీర్ సాదిఖుల్లా, అమీరుల్లా బేగ్, చోటు, ముస్లిమ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

జయమ్మకు నివాళులు



ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

సోంపేట: విప్లవధీర జయమ్మకు నివాళిని 18 నుంచి 24వ తేదీ వరకు జిల్లావ్యాపంగా నిర్వహించేలా సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా మండలంలోని బారువ, కొర్లాం, శాసనాం, లక్కవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈనెల 22న శ్రీకాకుళం ఎన్జీవో హోమ్‌లో ఉదయం 10గంటలకు జయమ్మ స్మారక సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గొరకల బాలకృష్ణ, ప్రజాసంఘాల నాయకులు పోతనపల్లి కుసుమ, ఎస్.విజయ్‌కుమార్, రాపాక మాధవరావు, జె.అప్పయ్య, పోతనపల్లి మల్లేశ్వరరావు ఉన్నారు.

తరచూ ప్రమాదాలు

● భారీ గడ్డి వాహనాలు రాకపోకలతో అవస్థలు

● ఇదీ అలికాం-బత్తిలి రహదారిలో పరిస్థితి



అలికాం-బత్తిలి రోడ్డులో గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్

సరుబుజ్జిలి: మండలంలో అలికాం-బత్తిలి రహదారిలో భారీ గడ్డి వాహ నాలరాకపోకల వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల రొట్టవలస సమీపంలో ఉదయం వాహనాల రాకపోకలతో రద్దీ ఉన్న సమయంలో గడ్డి ట్రాక్టర్ వెళ్లడంతో వెనుక నుంచి వెళ్తున్న మరో వాహనం గడ్డి ట్రాక్టర్‌ను తప్పించి ముందుకు వెళ్లే ప్రయత్నంలో డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించడంతో త్రుటిలో ప్రమాదం తప్పిన విషయం విదితమే. నిబంధనల మేరకు గడ్డి ట్రాక్టర్లు, భారీ లారీలకు రాత్రివేళల్లో, ప్రధాన రహదారిపై వాహనాలు రద్దీ లేని సమయంలో అనుమతి ఇస్తారు. అయితే అలికాం- బత్తిలి రహదారిలో నిత్యం రద్దీగా ఉండే ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ గడ్డిని భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన పోలీసులు కూడా చోద్యం చూస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

కూలడానికి సిద్ధంగా ట్యాంక్

ఆమదాలవలస: పట్టణంలోని వెంగళరావుకాలనీ సమీపంలో ఉన్న రక్షిత తాగునీటి ట్యాంకు కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ప్రజలు భయపడుతున్నారు. 30 ఏళ్ల కిందట నిర్మించిన ఈ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. సంబంధిత అధికారులు దీనిపై దృష్టిసారించక పోవడంతో ఏ క్షణాన కూలుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంగళరావుకాలనీ, కుద్దిరాం, కనుగులవలస, తమ్మయ్యపేట, ముద్దాడపేట గ్రామకు వెళ్లే ప్రజలు ఈ ప్రాంతానికి వచ్చేసరికి భయప డుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంక్